TELUGU NEWS TIMES

# తెలుగు న్యూస్ టైమ్స్

జాతీయ దిన పత్రిక

J.M.Nayudu
Cell: 91 9840066999
SCCI
Sai Charan Comfort Inn
(Luxury Service Apartments)
Plot No. 1286 & 1345, 5th Street, Golden Colony,
Anna Nagar West Extn., Mugappair, Chennai-50.
Mobile : +91 9840089859, E-mail : saicomfortinn@gmail.com

సంపుటి : 3 | సంచిక : 237 | మంగళవారం 17 డిసెంబరు 2024 | పేజీలు : 4 | వెల రూ. 3 | ఎడిటర్ : సిహెచ్. ముకుంద రావు | 9043514736, 9840467131 | online E-paper

## 2026 అక్టోబరు నాటికి పోలవరం పూర్తి చేయడమే లక్ష్యం



**పోలవరం:** పోలవరం ప్రాజెక్టును 2026 అక్టోబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. 2025 డిసెంబర్ నాటికి డయాఫ్రం వాల్ పూర్తి కావాలని అధికారులకు చెప్పానని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు వద్ద సీఎం చంద్రబాబు సుడిగాలి పర్యటన చేశారు. హెలికాప్టర్‌లో పోలవరం చేరుకున్న సీఎం.. వస్తూనే విహంగ వీక్షణం చేశారు. ఆ తర్వాత మంత్రి నిమ్మల రామానాయుడు, ఇతర అధికారులతో కలిసి వ్యూపాయింట్‌కు వెళ్లారు. పోలవరం గ్యాప్1 పనులను పరిశీలించి.. ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు. ప్రాజెక్టు రోడ్డు మార్గం ద్వారా నిర్మాణ ప్రాంతానికి వెళ్లి.. అక్కడి పనులు పరిశీలించారు. డయాఫ్రం వాల్ నిర్మాణ పనులపై ఆరా తీశారు. అనంతరం అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించి, పోలవరం ప్రాజెక్టు పనుల షెడ్యూల్‌ను ప్రకటించారు.

**పోలవరం ఏపీకి జీవనాడి** : పోలవరం ప్రాజెక్టు ఏపీకి జీవనాడి అని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల 7.20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు అందుబాటులోకి వస్తుందన్నారు. 28 లక్షల మందికి తాగునీరు, 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి సాధ్యపడుతుందన్నారు. విశాఖ పారిశ్రామిక అవసరాలు, తాగునీటికి 23 టీఎంసీలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. " పోలవరం, అమరావతి రాష్ట్రానికి రెండు కళ్లు. పోలవరం పూర్తి చేసి నదుల అనుసంధానం చేస్తే రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ అవుతుంది. పట్టిసీమ ద్వారా కృష్ణా నదికి అనుసంధానం చేశాం. రాబోయే రోజుల్లో నేరుగా కృష్ణా నుంచి నాగార్జున సాగర్ కెనాల్‌కు అనుసంధానం చేయాలి. గొల్లపల్లి రిజర్వాయర్ వస్తే చాలావరకు ఇబ్బంది ఉండదు. వెలిగొండ ఇరిగేషన్‌కు కూడా నీళ్లు ఇచ్చే పరిస్థితి వస్తుంది. అక్కడి నుంచి బనకచర్లకు నీటిని తీసుకెళ్లొచ్చు.

**రాష్ట్ర మంతటికీ ఉపయోగం** : నేరుగా నీటిని విశాఖకు కూడా తరలించి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, అక్కడి నుంచి వంశధారకు వెళ్తుంది. ఈ పనులన్నీ పూర్తి చేయగలిగితే రాష్ట్రంలో అన్ని జిల్లాలకు ఉపయోగం ఉంటుంది. శ్రీకాకుళం నుంచి కర్నూలు, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి వరకు నీటి సమస్య ఉండదు. ప్రాజెక్టు ప్రాముఖ్యత చూస్తే 50 లక్షల క్యూసెక్కులు డిశ్చార్జ్ చేసే సామర్థ్యం ఉంది. 93 మీటర్లు డయా ఫ్రం వాల్.. అత్యంత ఎత్తైన స్పిల్ వే గేట్లు ఏర్పాటు చేస్తున్నాం. బహుళ ప్రయోజనాల కోసం వినియోగించే ప్రాజెక్టు పోలవరం" అని సీఎం చంద్రబాబు తెలిపారు.

**రేయింబవళ్లు పని చేశాం** : " 2014 నుంచి 2019 వరకు రేయింబవళ్లు పని చేశాం. ముందుజాగ్రత్త చర్యతో 2014లో సీఎంకాగానే ఏడు ముంపు మండలాలు ఇవ్వకపోతే ప్రమాణం చేయనని చెప్పా. మొదటి కేబినెట్ పట్టుకొని 7 మండలాలు ఇచ్చిన తర్వాతే పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేశారు. ఒక్క రోజులో స్పిల్ ఛానల్‌లో 32,215 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేసి గిన్నిస్ రికార్డు కూడా బ్రేక్ చేశాం. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు రెండూ పూర్తి చేశాం. డయాఫ్రం వాల్‌ను 414 రోజుల్లో పూర్తి చేశాం. 2కి.మీ పొడవుతో దాదాపు 100 మీటర్ల డయాఫ్రం వాల్‌కు కూడా శ్రీకారం చుట్టాం. ప్రతి పనిని పీపీఏ, సెంట్రల్ వాటర్ కమిషన్ అనుమతిస్తూ వచ్చారు. 72 శాతం పనులు పూర్తి చేశాం. 28 సార్లు క్షేత్ర పరిశీలన చేశా. 82 సార్లు వర్చువల్‌గా సమీక్షలు చేశా. సోమవారాన్ని పోలవరంగా చేసుకొని సమీక్షలు చేశాం. గత ప్రభుత్వం 2019లో అధికారంలోకి రాగానే పోలవరం కాంట్రాక్టర్‌ను మారుస్తామని చెప్పారు. బలవంతంగా 2019 జులైలో నోటీసులిచ్చి సైట్ నుంచి వెళ్లిపోవాలని ఆదేశాలిచ్చారు. 15 నెలల పాటు ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రాజెక్టును సర్వనాశనం చేశారు. 50 లక్షల క్యూసెక్కుల నీళ్లు డిశ్చార్జ్‌కు మనం నిర్మాణాలు చేశాం. ఆగస్టు, అక్టోబరులో వరదలకు డయాఫ్రం వాల్ పూర్తిగా దెబ్బతింది. దాని తర్వాత పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేశారు. పట్టించుకోలేదు. అసమర్థత, అవగాహనరాహిత్యం, అవినీతి, కుట్ర, అన్నీ కలిపి ప్రాజెక్టును నాశనం చేశారు." అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రామేశ్వరం-శ్రీలంక మధ్య ఫెర్రీ సర్వీసులు



**ఢిల్లీ** : తమిళనాడులోని రామేశ్వరం- శ్రీలంకలోని తలైమన్నార్‌ల మధ్య ఫెర్రీ సర్వీసులు మొదలుపెట్టాలని నిర్ణయించినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. రక్షణ సహకారానికి సంబంధించిన ఒప్పందానికి త్వరలో ఓ తుది రూపం ఇచ్చేందుకు అంగీకరించామని చెప్పారు. శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకేతో కలిసి సంయుక్తంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన మోదీ.. తమిళుల ఆకాంక్షలను శ్రీలంక నెరవేరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.భారత్‌లో పర్యటిస్తున్న శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే, ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. రక్షణ, ఇంధన, వాణిజ్యంతోపాటు పలు కీలక రంగాల్లో సంబంధాలపై చర్చించామని ఇరువురు నేతలు పేర్కొన్నారు. ఆయా రంగాల్లో తమ భాగస్వామ్యాన్ని మరింత విస్తరిస్తామని.. రెండు దేశాల మధ్య కనెక్టివిటీ మరింత మెరుగుపరిచేందుకు గాను రామేశ్వరం-తలైమన్నార్‌ల మధ్య ఫెర్రీ సర్వీసులు ప్రారంభించనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు.

## చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి హైకోర్టులో చుక్కెదురు


**అమరావతి:** పోక్సో చట్టం కింద తనపై పోలీసులు నమోదు చేసిన కేసు కొట్టివేయాలని వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 24కు వాయిదా వేసింది. క్వాష్ పిటిషన్‌లో అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని పిటిషనర్‌కు హైకోర్టు స్పష్టం చేసింది.

## కుటుంబం కోసం రాజ్యాంగాన్ని మార్చివేశారు



**ఢిల్లీ** : భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకొని 75వ ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భం గా రాజ్యసభలో సోమవారం ప్రత్యేక చర్చ జరుగుతోంది. అధికార పక్షం తరఫున కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ చర్చను ప్రారంభించారు. ఈసందర్భంగా కాంగ్రెస్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. కుటుంబం కోసం రాజ్యాంగాన్నే మార్చివేశారని దుయ్యబట్టారు. "రెండో ప్రపంచయుద్ధం తర్వాత దాదాపు 50 దేశాలకు స్వాతంత్ర్యం లభించింది. అవి రాజ్యాంగాన్ని రచించుకున్నాయి. కాలక్రమంలో పలు దేశాలు తమ రాజ్యాంగం అసలు ఉద్దేశాన్ని మార్చివేశాయి. కానీ మన రాజ్యాంగం మాత్రం కాలపరీక్షలను తట్టుకొని నిలబడింది. వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేసేందుకు కాంగ్రెస్ సవరణలు చేసింది. ఇప్పుడు మాత్రం రాజ్యాంగ పరిరక్షణ గురించి ప్రసంగాలు చేస్తోంది" అని సీతారామన్ మండిపడ్డారు. ఇందిర హయాంలో విధించిన ఎమర్జెన్సీ, 42వ రాజ్యాంగ సవరణ గురించి ఆమె ప్రస్తావించారు. "కాంగ్రెస్ చేసిన సవరణలు రాజ్యాంగం బలోపేతానికి కాదు. అధికారంలో ఉన్నవారిని రక్షించుకోవడానికి.. కుటుంబం కోసం ఈ ప్రక్రియను ఉపయోగించారు" అని వ్యాఖ్యలు చేశారు. ఇందిర అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాంగాన్ని నిలిపివేయాలని ప్రయత్నించారని భాజపా చీఫ్, కేంద్రమంత్రి జేపీ నడ్డా విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నుంచి అభ్యంతరం వ్యక్తమైంది.

## రాజ్యసభ సభ్యులుగా ప్రమాణం



**ఢిల్లీ:** ఏపీ నుంచి ఎన్నికైన ముగ్గురు నేతలు రాజ్యసభ సభ్యులుగా ప్రమాణం చేశారు. రాజ్యసభలో ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వారి చేత ప్రమాణం చేయించారు. రాష్ట్రం నుంచి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో తెదేపా నుంచి బీద మస్తాన్‌రావు, సానా సతీష్ బాబు, భాజపా నుంచి ఆర్.కృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే.

## సంక్రాంతి పందేలకు నెల్లూరు జిల్లా నుంచి కోడి పుంజులు

**అమరావతి : సంక్రాంతి పందేల్లో కాలు దువ్వేందుకు సింహపురి నుంచి కోడి పుంజులొచ్చేశాయి. నెల్లూరు ప్రాంతంలో పెంచిన కాకి, నెమలి, డేగ, పచ్చకాకి, కేతువ తదితర జాతుల పుంజులు పందేలరాయుళ్లను ఆకర్షిస్తున్నాయి. రకాన్ని బట్టి ఒక్కొక్క పుంజు రూ.3 వేల నుంచి రూ.6 వేల వరకు విక్రయిస్తున్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన వ్యాపారులు రావులపాలెం-ఏలూరు హైవే, రద్దీ రోడ్ల వెంబడి వీటిని విక్రయిస్తున్నారు.**

**భీమవరం బ్రీడ్‌నే అక్కడ పెంచి..** సంక్రాంతి కోడి పందేలకు ఉమ్మడి గోదావరి జిల్లాలు పెట్టింది పేరు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, వెంప, సీసలి, దుంపగడప, తూర్పు గోదావరి జిల్లాలోని మురమళ్ల, కాట్రేనికోన, వేట్లపాలెం కోడిపందేలకు పేరొందాయి. పెద్ద బరుల్లో రోజుకు 25 నుంచి 30 వరకు పందేలు జరిగితే.. గ్రామాల్లోని చిన్న బరుల్లో జరిగే పందేలకు లెక్కే ఉండదు.

సంక్రాంతి మూడు రోజులు వేలాదిగా జరిగే పందేలకు రెట్టింపు కోడిపుంజులు అవసరమవుతాయి. పందేలకు వినియోగించే 'భీమవరం బ్రీడ్' పుంజులకు గిరాకీ అంతాఇంతా కాదు. సంక్రాంతి పందేల కోసం ఉండి, ఆకివీడు, చెరుకుమిల్లి, చినఅమిరం, కాళ్ల, కోనసీమలోని అమలాపురం, లంక, మండపేట, రామచంద్రపురం, పెద్దాపురం తదితర ప్రాంతాల్లో భీమవరం బ్రీడ్ కోడిపుంజుల పెంపకం ద్వారా గోదావరి జిల్లాల్లో వందలాది మంది ఉపాధి పొందుతున్నారు. భీమవరం బ్రీడ్ పుంజులకు ఉన్న గిరాకీని దృష్టిలో పెట్టుకుని నెల్లూరీయులు వీటిని అక్కడ పెంచుతున్నారు. అనంతరం వాటిని గోదావరి జిల్లాలకు తెచ్చి విక్రయిస్తున్నారు.

**నెల ముందే వ్యాపారుల రాక** : వారం రోజుల్లో సంక్రాంతి నెల పట్టనుండగా.. నెల్లూరు జిల్లాకు చెందిన నాటుకోళ్ల పెంపకందారులు, వ్యాపారులు అప్పుడే గోదావరి జిల్లాల్లో అమ్మకాలు చేసేందుకు కోడి పుంజులతో తరలివస్తున్నారు. ఒక్కొక్కరు 15 నుంచి 20 పుంజులను తెస్తున్నారు. నలుగురైదుగురు గుంపుగా వచ్చి రావులపాలెం-ఏలూరు హైవే వెంబడి, రద్దీ రోడ్డు పక్కన ఖాళీ ప్రదేశాల్లో పుంజుల్ని ఉంచి అమ్మకాలు చేస్తున్నారు.




పందెం కోళ్లలోని దాదాపు అన్ని రకాల జాతులు వీరి వద్ద అందుబాటులో ఉంటున్నాయి. సాధారణంగా పందేల కోసం గోదావరి జిల్లాల్లో సిద్ధం చేసే పుంజులు చాలా ధర ఉంటాయి. పందెం పుంజులను కొత్త అల్లుళ్ల మాదిరిగా పెంచుతుంటారు. వాటికి మూడు నెలల ముందునుంచే మటన్ కీమా, డ్రైఫ్రూట్స్ వంటి బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తుంటారు. శరీర పటుత్వాన్ని పెంచేందుకు వాకింగ్, ఈత కొట్టించడం, నీళ్లపోతలు, శాఖాలు తదితర రూపాల్లో ప్రత్యేకంగా ట్రైనర్లతో శిక్షణ ఇస్తుంటారు.

వాటికందించే ఆహారం, శిక్షణను బట్టి ఒక్కొక్క పుంజు ధర రూ.25 వేల నుంచి రూ.లక్ష కూడా దాటిపోతోంది. చూసేందుకు స్థానిక పుంజులకు ఏమాత్రం తీసిపోని విధంగా సైజులు, రంగుల్లో నెల్లూరు పుంజులు ఉంటున్నాయి. పుంజు రంగు, ఎత్తు, బరువును బట్టి రూ.3 వేల నుంచి రూ.6 వేలలోపే ధరలు ఉండటంతో వీటి కొనుగోలుకు పందెంరాయుళ్లు ఆసక్తి చూపుతున్నారు. వాటి కాళ్ల సామర్థ్యం, ప్రత్యర్థిపై దాడిచేసే వేగాన్ని పరీక్షించేందుకు అక్కడే డింకీ పందేలు కట్టి బాగున్న వాటిని బేరమాడి తీసుకుంటున్నారు. నెలరోజుల పాటు వాటికి తగిన మేతను అందించి శిక్షణ ఇవ్వడం ద్వారా పందేలకు సన్నద్ధం చేసే వీలుంటుందంటున్నారు.

# ఐదేళ్లకు జాతర.. లక్షల జీవాలకు పాతర





**ఢిల్లీ :** పొరుగు దేశం నేపాల్‌లో ఐదేళ్లకోమారు లక్షలాది మూగ జీవాలు బలి అవుతున్నాయి. ఈ అత్యంత ఘోరమైన చర్య బారా జిల్లాలోని గఢీమయీ దేవి జాతరలో చోటుచేసుకుంటుంది. ఈ జాతరలో 2.5 లక్షల నుంచి 5 లక్షల వరకూ మూగ జీవాలను బలిఇస్తుంటారు. అయితే ఈసారి భారత సశాస్త్ర సీమ బల్, స్థానిక యంత్రాంగం మూగజీవాలను రక్షించేందుకు నిరంతరం శ్రమించింది. డిసెంబరు 2న ప్రారంభమైన ఈ జాతర 15 రోజుల పాటు జరిగింది. జాతరలో డిసెంబర్ 8, 9 తేదీల్లో అంటే రెండు రోజుల్లోనే 4,200 గేదెలను బలి ఇచ్చినట్లు సమాచారం. అయితే అధికారుల చొరవకారణంగా 750 జంతువులు బలి బారినపడ కుండా తప్పించుకున్నాయి. వీటిలో గేదెలు, గొర్రెలు, మేకలు ఇతర జంతువులు ఉన్నాయి. ఈ జంతువులను గుజరాత్‌లోని జామ్‌నగర్‌లోని రిలయన్స్ గ్రూప్‌కు చెందిన వన్యప్రాణి పునరావాస కేంద్రానికి అధికారులు తరలించారు. నేపాల్‌లోని గఢీమయీ ఆలయంలో ఈ జాతరను డిసెంబర్ 2వ తేదీన నేపాల్ ఉపాధ్యక్షుడు రామ్ సహాయ్ యాదవ్ ప్రారంభించారు. ఈ జాతర డిసెంబర్ 15 వరకు కొనసాగింది. డిసెంబరు 8వ తేదీన ప్రత్యేక పూజలు నిర్వహించిన జనం లెక్కకుమించిన రీతిలో జంతువులను, పక్షులను బలి ఇచ్చారు. ఈ రక్తపాత సంప్రదాయానికి స్థానికుల మూఢనమ్మకాలే కారణంగా నిలుస్తున్నాయి. 265 ఏళ్లుగా గఢీమయీ ఉత్సవం జరుగుతోంది. 2019లో జంతుబలిని నిలిపివేయాలని నేపాల్ సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రపంచంలోనే అత్యధిక జంతుబలులు ఈ జాతర సమయంలోనే జరుగుతాయని అంటారు. గఢీమయీ జాతర అతిపెద్ద సామూహిక బలి కర్మగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకుంది. ఇక్కడ మొదటగా వారణాసిలోని దోమ్రాజ్ నుంచి 5,100 జంతువులను తీసుకువచ్చి బలి ఇస్తారు. జాతర జరిగే రోజుల్లో రోజుకు ఐదు లక్షలాది మంది భక్తులు వస్తుంటారని అంచనా. నేపాల్‌తో పాటు భూటాన్, బంగ్లాదేశ్, భారత్ సహా పలు దేశాల నుంచి లక్షలాదిమంది భక్తులు ఈ జాతరకు తరలివస్తుంటారు. ప్రపంచంలోని పలు దేశాల్లో ఇటువంటి జంతు బలులను నిషేధించారు. నేపాల్‌లో జరిగే ఈ జాతరను వ్యతిరేకిస్తూ భారతదేశం కూడా తన గొంతు కలిపింది. 2019లో నేపాల్ సుప్రీంకోర్టు ఈ జంతుబలిని వెంటనే నిషేధించడానికి నిరాకరిం చింది. అయితే జంతుబలిని క్రమంగా తగ్గించాలని ఆదేశించింది. ఇది మత విశ్వాసాలకు సంబంధించి నదని, ఎవరి మనోభావాలను దెబ్బతీయకూడదని కోర్టు పేర్కొంది.

## పేద విద్యార్థులకు డాక్టర్ శివకుమారి వితరణ





**విల్లివాకం న్యూస్:** లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 324 ఎం జిల్లాలోని సౌత్ సిటీ అధ్యక్షురాలు డాక్టర్ ఏవి శివకుమారి హంగర్ అండ్ డిజాస్టర్ రిలీఫ్ కు గాను నిరుపేద, బడుగు వర్గాల విద్యార్థులైన 8, 9వ తరగతి, కార్పొరేషన్ స్కూలులో చదువుతున్న వారికి తన వంతు సహాయ సహకారాలు తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్మెంట్ అథారిటీ, మెంబర్ సెక్రటరీ జె.మేఘనాధ రెడ్డి, ఐఏఎస్ చేతుల మీదుగా అందించడం జరిగింది. సౌత్ సిటీ అధ్యక్షురాలు డాక్టర్ శివకుమారి తో పాటు ఆ క్లబ్ సీనియర్ మెంబర్ శ్రీ లక్ష్మీ మోహనరావు కూడా పాల్గొన్నారు.

# తిరుమావలవన్ పై డీఎంకే ఒత్తిడి లేదు



**గిండి న్యూస్:** మదురైలో పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, హైవేస్ డిపార్ట్‌మెంట్, కళైంజర్ శత జయంతి కార్యక్రమాలతో నిర్మిస్తున్న హైలెవల్ ఫ్లైఓవర్ పనులను మంత్రి ఎవి వేలు సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మధురైలో ఏర్పాటు చేసిన కళైంజర్ లైబ్రరీని 13 లక్షల 59 వేల 996 మంది వినియోగిస్తున్నారు. కళైంజర్ సెంటెనరీ లైబ్రరీకి అదనంగా 3-అంతస్తుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటు న్నారు,మదురై గొరిప్పా లయంలో నిర్మిస్తున్న హైలెవల్ ఫ్లైఓవర్ 2025 డిసెంబర్ నాటికి పూర్తవుతుంది. ప్రస్తుతం 25 శాతం వంతెన పనులు పూర్తయ్యాయి.మధురై అపోలో ఫ్లై ఓవర్ అక్టోబర్ 2025 నాటికి పూర్తవుతుంది. 32 శాతం వంతెన పనులు పూర్తయ్యాయి. నదిపై నిర్మించిన ఫ్లైఓవర్‌కి, రోడ్డుపై నిర్మించిన ఫ్లైఓవర్‌కి తేడా ఉంటుంది.2001 నుండి, నాకు లిబరేషన్ టైగర్స్ ఆఫ్ ఇండియా నాయకుడు తిరుమావళవన్‌తో పరిచయం ఉంది. నేను వ్యతిరేక శిబిరంలో ఉన్న సమయంలో, తిరుమావళవన్ నాతో ఒక సోదరుడిలా కలిసి ఉండగలిగాడు. విజయ్ పాల్గొన్న పుస్తకా విష్కరణ కార్యక్రమంలో పాల్గొనవద్దని తిరుమావళవన్‌పై నేను ఒత్తిడి చేయలేదు.తిరుమావళవన్‌పై డీఎంకే, నేను ఒత్తిడి చేయాల్సిన అవసరం లేదు. తిరుమావళవన్ తెలివైనవాడు. ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గి వ్యవహరించడని పేర్కొన్నారు.

## స్టేట్ హైవేస్ అథారిటీ బిల్లుకు గవర్నర్ ఆమోదం



**విల్లివాకం న్యూస్:** నేషనల్ హైవేస్ అథారిటీ తరహాలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేయనున్న తమిళనాడు స్టేట్ హైవేస్ అథారిటీని ఏర్పాటు చేసే బిల్లుకు తమిళనాడు గవర్నర్ ఆమోదం తెలిపారు. తమిళనాడు స్టేట్ హైవేస్ అథారిటీ ఏర్పాటు బిల్లు గత ఫిబ్రవరిలో శాసనసభలో ఆమోదం పొందింది. హైవేల నిర్మాణం, అభివృద్ధి, నిర్వహణ మరియు నిర్వహణ కోసం తమిళనాడు రాష్ట్ర రహదారుల అథారిటీని ఏర్పాటు చేయనున్నట్లు శాసనసభ తెలియజేసింది. ఈ బిల్లును తమిళనాడు గవర్నర్ ఆమోదం కోసం పంపారు. హైవేలను నిర్వహించడం, వాటిని అప్‌గ్రేడ్ చేయడం మరియు దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధం చేయడం ఈ కమిషన్ యొక్క పని. తమిళనాడు స్టేట్ హైవేస్ అథారిటీ హైవేల నిర్వహణ మరియు అప్‌గ్రేడ్ కోసం తక్షణ మరియు దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధం చేయవచ్చు.

## డా.కాసల నాగభూషణంకు విశిష్ట సాహితీ పురస్కారం



**విల్లివాకం న్యూస్:** పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మల విశిష్ట సాహితీ పురస్కారం-2024 ను అధ్యాపకరత్న, సమీక్షా సమ్రాట్ డా.కాసల నాగ భూషణం అందుకోనున్నారు. పురస్కార ప్రదాత పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి చేతుల మీదుగా ఈనెల 22వ తేదీ ఆదివారం ఉదయం 10:00 గంటలకు అందుకోనున్న ఈ కార్యక్రమానికి అద్దంకి, ఇందిరానగర్, పుట్టంరాజువారి వీథిలోని పుట్టంరాజు కళాక్షేత్రం వేదిక కానుంది. ఈ వివరాలను పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో వెల్లడించారు.

## అన్నామలైతో నటి కస్తూరి భేటి



**అన్నానగర్ న్యూస్:** తెలుగు మాట్లాడే వివాదంలో అరెస్టయిన నటి కస్తూరి బెయిల్‌పై విడుదలైంది. దీంతో తమిళనాడు బి.జె.పి నటి కస్తూరి సోమవారం రాష్ట్రపతి అన్నామలైని కలిశారు. చెన్నైలోని త్యాగరాయ నగర్‌లో బి.జె.పి. ప్రధాన కార్యాలయంలో అన్నామలై - కస్తూరి సమావేశం జరిగింది. అంతకుముందు బి.జె.పి రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై అధ్యక్షతన ప్రధాన కార్యాలయంలో కేంద్ర కమిటీ సమావేశం కూడా జరగడం గమనార్హం.

## బంగ్లాదేశ్‌లో దాడులపై భారత్ గళం విప్పాలి

**ఢిల్లీ:** బంగ్లాదేశ్‌లో మైనారిటీలు, హిందువులపై దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. దీనిపై లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ మాట్లాడారు. ఆ దాడులపై భారత్ గళం విప్పాలని కోరారు. "బంగ్లాదేశ్‌లో మైనారిటీలైన హిందూ, క్రిస్టియన్‌లపై జరుగుతున్న దాడులపై భారత ప్రభుత్వం గళం విప్పాలి. ఆ దేశంతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దేందుకు అక్కడి ప్రభుత్వాన్ని కోరాలి" అని అన్నారు. విజయ దివస్ సందర్భంగా 1971 యుద్ధంలో అమరులైన వారికి లోక్‌సభ వేదికగా సెల్యూట్ చేశారు. ఆనాటి తూర్పు పాకిస్థాన్ (నేటి బంగ్లాదేశ్) పరిస్థితిని ఇందిరాగాంధీ ధైర్యంగా చక్కదిద్దారని కొనియాడారు. ప్రియాంకా బ్యాగ్ అందరి దృష్టిని ఆకర్షించింది. దానిపై 'పాలస్తీనా' అని ఇంగ్లీష్‌లో రాసి ఉంది. ఇజ్రాయెల్ దాడులతో దుర్భర పరిస్థితులను అనుభవిస్తోన్న పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ఆమె దానిని తీసుకువచ్చారు. ఇదిలా ఉంటే.. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్‌హసీనా దేశం విడిచివెళ్లిన తర్వాత బంగ్లాలో హిందూ మైనార్టీలపై దాడులు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టుతో పరిస్థితి మరింత దిగజారింది. ఆయనకు న్యాయసాయం అందించడంపై కూడా ఆందోళనలు నెలకొన్నాయి. దీనిపై ఇటీవల విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మాట్లాడుతూ.. దాడులను నివారించడానికి ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం మైనారిటీలు, హిందువుల భద్రతకు తగిన చర్యలు తీసుకుం టుందని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. ఈవిషయంపై ఇటీవల భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ బంగ్లాదేశ్‌కు వెళ్లి అక్కడి నేతలతో చర్చలు జరిపారన్నారు.

## రాజధాని రైతుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం

**మంగళగిరి:** రాజధాని రైతుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. నీరుకొండలో ఎంజీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం అమరావతిని నాశనం చేయాలని ఆర్-5 జోన్ తీసుకొచ్చిందని ఆరోపించారు. ఆర్-5 జోన్‌లో పట్టాలిచ్చిన పేదలకు గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో స్థలాలిస్తామని చెప్పారు. సుప్రీంకోర్టులో రాజధానిపై ఉన్న కేసులు పరిష్కరించేలా ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. మరో 9 నెలల్లో అమరావతిలో అధికారులకు నివాసాలు అందుబాటులోకి తెస్తామన్నారు. గతంలో చెప్పిన విధంగానే రాజధానిని తప్పకుండా పూర్తిచేస్తామని.. మూడేళ్లలో ఇది సాధ్యం కానుందన్నారు. ఇప్పటికే రూ.20 వేల కోట్ల పనులకు సంబంధించిన టెండర్లకు సీఆర్‌డీఏ ఆమోదం లభించిందని.. నాలుగైదు రోజుల్లో టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని మంత్రి నారాయణ చెప్పారు.



TELUGU NEWS TIMES
తెలుగు న్యూస్ టైమ్స్
జాతీయ దిన పత్రిక



# రూ.1,500 కోట్ల పెట్టుబడితో షూ ఫ్యాక్టరీకి స్టాలిన్ శంకుస్థాపన

**విల్లివాకం న్యూస్:** రాణిపేట జిల్లాలోని పనప్పక్కంలో రూ. 1,500 కోట్ల పెట్టుబడితో షూ ఫ్యాక్టరీకి ముఖ్యమంత్రి ఎమ్ కే స్టాలిన్ శంకుస్థాపన చేశారు. ఆర్థికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంలో తమిళనాడు దేశంలోనే అగ్రగామిగా ఉంది. తమిళనాడు పారిశ్రామికాభివృద్ధికి ముఖ్య మంత్రి ఎం.కె.స్టాలిన్ అలుపెరగని కృషి చేస్తున్నారు. తమిళనాడు అభివృద్ధి కోసం ప్రభుత్వం శరవేగంగా పలు చర్యలు తీసుకుంటోంది. ఈ సందర్భంగా, ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ సమక్షంలో, తైవాన్‌కు చెందిన హాంగ్‌పు ఇండస్ట్రియల్ గ్రూప్ షూ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు గతేడాది తమిళనాడు వాణిజ్య శాఖతో ఎంఓయూ కుదుర్చుకుంది.దీనిని అనుస రించి, హాంగ్‌పు ఇండస్ట్రియల్ గ్రూప్ చైర్మన్ టివై సంగ్‌కు సూత్రప్రాయంగా భూమి కేటాయింపు ఉత్తర్వు ఇవ్వబడింది. దీని ప్రకారం రాణిపేట జిల్లాలోని పనప్పక్కం సిప్‌కాట్ ఇండస్ట్రియల్ పార్కులో 125 ఎకరాల భూమిని ప్రత్యేక ఆర్థిక మండలంలో, గృహావసరాలకు 5 ఎకరాల భూమిని కేటాయించారు. దీంతో అక్కడ తొలిదశ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పరిస్థితిలో ముఖ్యమంత్రి



ఎం.కె.స్టాలిన్ సోమవారం పనప్పక్కంలో చెప్పుల తయారీ కర్మాగారాన్ని ప్రారంభించేందుకు శంకు స్థాపన చేశారు. దీనికి సంబంధించిన కార్యక్రమం సోమవారం ఉదయం చెన్నై సచివాలయంలో వీడియో ద్వారా జరిగింది. ఇందులో పరిశ్రమల శాఖ మంత్రి టి.ఆర్.పి.రాజా, ముఖ్య కార్యదర్శి మురుగానందం, పరిశ్రమల శాఖ కార్యదర్శి అరుణ్ రాయ్, తైవాన్‌కు చెందిన హాంగ్‌పు కంపెనీ అధికారులు పాల్గొన్నారు. రూ.1,500 కోట్ల పెట్టుబడితో ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడం వల్ల వేలూరు, రాణిపేట, తిరుపత్తూరు, తిరువణ్ణామలై జిల్లాలకు చెందిన 25 వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా.



# సమ సమాజ దార్శనికుడు పద్మభూషణ్ బోయి భీమన్న

**విల్లివాకం న్యూస్:** మద్రాసు విశ్వవిద్యాలయం, తెలుగుశాఖలో ప్రముఖ సాహితీవేత్త, తెలుగు సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కవి, విమర్శకులు, సమ సమాజ దార్శనికుడు పద్మభూషణ్ బోయిభీమన్న గారి 20వ వర్ధంతిని సోమవారం మధ్యాహ్నం జరుపుకున్నారు.

ఈ కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు బోయి భీమన్న జీవితం, సాహిత్యంపై ఉపన్యసించారు. అద్భుతమైన సాహిత్య సృష్టితో సామాజిక చైతన్యాన్ని ఆశించి జాతిని జాగృతం చేసిన మహాకవి బోయి భీమన్న అన్నారు. భీమన్న గారి వ్యక్తిత్వం, సాహిత్యం విశిష్టమైనదన్నారు. సామాజిక ప్రయోజనాన్ని ఆశించి జాతి సమైక్యతే ధ్యేయంగా ముందుకుసాగి 84 ఏళు ్ళ పాటు శ్రమించి దాదాపు 70కి పైగా గ్రంథాలను రాసి తనకంటూ సాహిత్య చరిత్రలో సుస్థిరమైన స్థానాన్ని ఏర్పరుచుకున్న మహోన్నతమైన వ్యక్తి అని పేర్కొన్నారు. మహాకవిగా, సాహితీ వసంతగా, పద్మశ్రీగా, నవయుగ కవిసార్వభౌమునిగా, పద్మభూషణ్ గా అనేక బిరుదులు అందుకోవడమే కాక అనేక సత్కారాలు, సన్మానాలు పొంది పలుపురిచేత ప్రశంసలు అందుకున్న బోయి భీమన్న సాహిత్యం ఎందరికో ఆదర్శప్రాయంగా నిలిచింది అనడంలో సందేహం లేదన్నారు. ఈ నేపథ్యంలో నేడు 20వ వర్ధంతిని నిర్వహించుకోవడం జరిగిందని



పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో జనని, ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య మాట్లాడుతూ మహాకవులుగా కీర్తించ బడినవారు ఎన్ని రచనలు చేసినా ఆ కవి పేరు చెప్పిన వెంటనే ఏదో ఒకటి, రెండు రచనల పేర్లు మాత్రమే గుర్తుకు వస్తాయి. కాని బోయి భీమన్న రచనల పేర్లు భీమన్న పేరుకంటే మరింత ఆదరణ పొందాయన్నారు. ముఖ్యం గా భీమన్న పేరు చెబితే వెంటనే గుర్తుకు వచ్చే రచనలు పాలేరు, జానపదుని జాబులు, పడిపోతున్న అడ్డు గోడలు, రాగవాసిష్టం, త్రిపదులు, శ్రీపిల్లి శతకం, గుడిసెలు కాలిపోతున్నాయి.. ఇలా ఎన్నో రచనల ద్వారా సమ సమాజ దార్శనికతను కలిగించడమే కాక ప్రతి రచనను ఎంతో వైవిధ్యంగా తీర్చిదిద్దిన వైనం పాఠకులను ఆలోచింపజేసేవిగా ఉంటాయ న్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుశాఖ అతిథి ఉప న్యాసకులు డా. పాండురంగం కాళియప్ప, డా. మాదా శంకరబాబు, రాణీమేరి కళా శాల అధ్యాప కులు డా. జి.దయామణి, ఎన్. స్వరూప, మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఎం.ఏ., పిహెచ్.డి. విద్యార్థులు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.

# అభిమానులు వదంతులను నమ్మవద్దు : ఇళయరాజా



**గిండి న్యూస్:** ప్రముఖ శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ ఆలయంలో ఆదివారం దివ్య పాశురం సంగీత కచేరీ జరిగింది. ఈ కార్యక్రమంలో సంగీత స్వరకర్త ఇళయరాజా పాల్గొన్నారు. ఆ తర్వాత ఇళయరాజ అక్కడి ఆండాళ్ ఆలయంలో పూజలు నిర్వహిం చారు. ఆయనకు పూర్ణ కుంభ గౌరవం లభించింది. ఆ తర్వాత జీయర్లు గర్భగుడిలోకి ప్రవేశించగానే ఇళయరాజా కూడా ప్రవేశించారు. ఇది చూసిన జీయర్లు మరియు పాత్రలు ఇళయరాజాను గర్భ గుడి వెలుపల నిలబడమని కోరారు. ఆ తర్వాత ఇళయరాజా గర్భగుడి వెలుపలికి వెళ్లి పూజలు చేశారు. ఆ తర్వాత ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.శ్రీవిల్లుపుత్తూరు ఆండాళ్ ఆలయం గర్భగుడిలోకి ప్రవేశించేందుకు ఇళయరాజాకు అనుమతి నిరాకరించారని వివిధ పార్టీలు తమ అభిప్రాయాలను పోస్ట్ చేశాయి. దీని తర్వాత ఆండాళ్ ఆలయంలో ఇళయరాజా ఏమయ్యాడు? దీనిపై హిందూ మత ధర్మాదాయ శాఖ వివరణ ఇచ్చింది. ఆలయ సంప్రదాయం మరియు ఆచా రం ప్రకారం, అర్ధ మండపం వద్దకు ఇతర వ్యక్తులను అనుమతించరు. అర్ధ మండపం వరకు పూజారి, పారిష్ పూజారి మరియు మఠాధిపతి మాత్రమే అనుమతించబడతారు.నేను సంగీత స్వరకర్త ఇళయరాజా రామానుజయ్యతో కలిసి అర్ధ మండపం గేటు వరకు ఆండాళ్ గుడికి వెళ్లినప్పుడు, అర్ధ మండపం ముందు ఆగి దర్శనం చేసుకుం టానని చెప్పారు. జీయర్ మాటకు సమ్మతించి ఇళయరాజా కూడా అర్ధ మండపం ముందు నిలబడి దర్శనం చేసుకున్నట్లు సమాచారం.ఈ స్థితిలో సంగీత స్వరకర్త ఇళయరాజా ప్రచురించిన ఎక్స్ వెబ్‌సైట్‌లో.. "నన్ను కేంద్రంగా చేసుకుని కొందరు తప్పుడు వదంతులు ప్రచారం చేస్తున్నారు.. నేను ఎప్పుడైనా, ఎక్కడైనా ఆత్మగౌరవాన్ని వదులుకునే వాడిని కాదు.. లేనిపోని వార్తలను ప్రచారం చేస్తున్నారని, ప్రజలు ఈ పుకార్లను నమ్మవద్దని అన్నారు.

# తిరుపూర్ లో రైతుల ధర్నా: 100 మంది అరెస్టు



**అన్నానగర్ న్యూస్:** తమిళనాడు పార్టీలకతీతంగా రైతు సంఘాలు తిరుపూర్ రైల్వేస్టేషన్‌లో కేంద్ర ప్రభుత్వ కార్యకలాపాలను నిరసించాయి. అక్కడ రాష్ట్ర నాయకుడు షణ్ముగం నేతృత్వంలో కుమరన్ విగ్రహం ముందు మహిళలు సహా 100 మంది రైతులు నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆ సమయంలో రైతులు, బీజేపీ, ప్రభుత్వం రైతులపై అణిచివేతతో వ్యవహరిస్తున్నాయి. ఉత్పత్తులకు కనీస మూల ధర చట్టం తీసుకురావాలి. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను రద్దు చేసిన విద్యుత్ నియంత్రణ చట్టాన్ని ఉపసంహరించు కోవాలి. రైతులకు మొత్తం రుణమాఫీ చేయాలి. ఎం.ఎస్.పి. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న జగ్జీత్ సింగ్ దల్లె వాల్‌కు పిలుపునివ్వాలనే డిమాండ్లను వారు ఖండిస్తూ నినాదాలు చేశారు. రైల్వే స్టేషన్ వైపు వెళ్లగానే పోలీసులు వారిని అడ్డుకుని అరెస్ట్ చేశారు.

With best compliments from
Rtn, J.S.K. Naidu
Proprietor
9840066772



NATIONAL INDUSTRIAL SECURITY AGENCY
Specialized in security services
The best & Reliable Security Services for
Institutions
Industries
Commercial Offices
Apartments
Bungalows
Hospitals
Banks
Bouncer Ceremonial Functions & Events



JSK SECURITY SERVICES (P) LTD
Specialized in investigation of



Matrimonial
Thefts
Finger Prints
Pre & Pro Bio Data of Employees
Company records of Employees
NISA SECURITY
No.28/24, 1st Main Road, Jai Nagar, Arumbakkam, Ch-106
Ph: 044-43531187 | Mobile: 98400 39394 | 98400 28888
E-Mail: nisaagency01@gmail.com
15